

భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు

కొడంగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 19లో ప్రభుత్వ మెడికల్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు డీటీసీబీ లేఅవుట్‌తో 125 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వచ్చేవారం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు కులకచర్లలో మంత్రుల పర్యటన



కులకచర్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 11:30 గంటలకు మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్ ప్రారంభిస్తారు. అనంతరం కులకచర్ల మార్కెట్ యార్డులో నూతనంగా నియామకమైన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో వారు పాల్గొననున్నారు. ఇందుకు స్థానిక నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.


కామన్ డైట్ చార్ట్‌ను ప్రదర్శిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తాం

- ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి
- చిలుకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభం
- ఐఐటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

రంగారెడ్డి అర్బన్/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, ప్రమాణాలు పెంచాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం చిల్కూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం ఆయన విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. నిత్యం వడ్డిస్తున్న భోజనం గురించి తెలుసుకున్నారు. చిలుకూరు గురుకుల పాఠశాలలో చదువుకుని మద్రాసులో ఐఐటీకి ఎంపికైన వై. సాయిరాం, అమన్, ఉస్మానియ విశ్వవిద్యాలయంలో చదువుతున్న శృతి, హేమంత్, ఎన్‌డీఏకు ఎంపికైన సిద్దార్థ, రాష్ట్ర స్థాయి ఫిజియోథెరిఫీకి ఎంపికైన బి. దీక్షితకు సీఎం రేవంత్‌రెడ్డి లాప్‌టాప్‌లను అందజేశారు. పాఠశాలలో మృదంగ వాయిద్యం నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. పిల్లల్లో మల్టీ టాలెంట్ గుర్తించాలని, వారికి తగిన శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ప్రభుత్వ చిఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. విద్యార్థులకు మంచి వసతులను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేనూ హాస్టల్లో ఉండి చదువుకున్నా

తాను కూడా ఎస్సీ హాస్టల్లో ఉండి చదువుకున్నానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తాను చదువుకునే సమయంలో హాస్టల్స్‌లో మంచి భోజనం ఉండేది కాదని.. ఇప్పుడు సన్న బియ్యంతో రుచికరమైన భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న చేవెళ్లలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.300 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.200 కోట్లు మంజూరు చేయాలని ఆయన సీఎంను కోరారు.

పదేళ్ల తర్వాత పెరిగిన డైట్ చార్జీలు

పదేళ్ల తర్వాత 40 శాతం డైట్ చార్జీలు పెరిగాయని, 15 ఏళ్ల తర్వాత కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెరిగాయని గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. 3,900 వెల్ఫేర్ హాస్టల్స్‌లో కామన్ డైట్ మెనూ అమలు కానున్నట్లు చెప్పారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందన్నారు. గురుకులాల్లో 8 వేల మంది ఉద్యోగ సిబ్బందిని తీసుకున్నట్లు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను భర్తీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అలుగు వర్షిని (ఐఏఎస్), కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహిళా ఛైర్మన్ శోభారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూధన్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కామన్ డైట్‌తో విద్యార్థులకు పౌష్టికాహారం

- ప్రతిష్ఠాత్మకంగా డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వివరాలు 7లో..

30 కేంద్రాలు..

10,196 మంది అభ్యర్థులు

గ్రూప్-2 పరీక్షకు సర్వం సిద్ధం

- నేడు, రేపు కొనసాగనున్న పరీక్షలు
- అరగంట ముందే గేట్లు మూసివేత


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేడు, రేపు నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు కల్పించకుండా, పకడ్బందీగా పరీక్ష నిర్వహించే విధంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, టీజీపీఎస్సీ ప్రత్యేక పరిశీలకులతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించి సమీక్షించారు. 15, 16వ తేదీల్లో జరగనున్న ఈ పరీక్ష నిర్వహణలో అనుసరించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వారికి అవగాహన కల్పించారు. టీజీపీఎస్సీ నిబంధనలు విధిగా పాటించాలని, అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ కనీస మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు

జిల్లాలో మొత్తం 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 10,196 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం తాండూరు పరిధిలో 11, వికారాబాద్‌లో 14, పరిగిలో 4, పూడూరు మండలంలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో

- మిగతా 8వ పేజీలో..

ఘట్‌కేసర్‌లో ఉద్రిక్తత

- వంతెన నిర్మాణానికి ఇళ్ల కూల్చివేత


జేసీబీతో ఇళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా శనివారం అధికారులు 20 ఇళ్లను కూల్చివేశారు. బాధితుల ఆందోళనతో ఘట్‌కేసర్‌లో ఉద్రిక్తత నెలకొంది. కొంతకాలంగా వంతెన నిర్మాణానికి స్థానికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో అధికారులు అప్రమత్తమై పనులను వేగవంతం చేశారు. గతంలో కొంత మంది బాధితులకు పరిహారం చెల్లించారు. శనివారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిహారం తీసుకున్నవారి ఇళ్లను కూల్చివేశారు. కాగా, పరిహారం ఇవ్వకుండానే తమ ఇళ్లను ఎలా కూల్చివేస్తారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణ ప్రక్రియనే రద్దు చేయాలని న్యాయస్థానం ఉత్తర్వులు ఉన్నట్లు పలువురు బాధితులు వారించారు. దీంతో కొన్ని ఇళ్లను కూల్చివేసి అధికారులు వెనుదిరిగారు. అందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో వంతెన నిర్మాణాన్ని వదిలేశారని ఆరోపించారు. తాము ఏడాదిలోనే పనులను ముమ్మరం చేసినప్పటికీ దీక్షల పేరుతో జనాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు.



కొత్త పాలకవర్గంపై సరికొత్త ఆశలు!

- నేడు పరిగి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం
- ముగ్గురు మంత్రులు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ రాక
- రైతు బజారు ఏర్పాటుపై ఆశలు

వివరాలు 7లో..



రాజీపడితే ఇద్దరూ నెగ్గినట్లే

- లోక్ అదాలత్‌లో 2,009 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వివరాలు 6లో..

పథకాల అమలులో మేడ్చల్ మొదటి స్థానం


డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించడంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉందని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనేక పథకాలు జిల్లా నుంచే ప్రారంభం కావడం ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ వివరించారు. జిల్లాలోని గర్భిణుల్లో తలసేమియా(రక్తహీనత) గుర్తించి, వారికి తగిన విధంగా వైద్యసేవలు అందిస్తున్నామని ఇది జిల్లాలోనే ప్రారంభమైందన్నారు. పాఠశాల విద్యార్థులను స్క్రీనింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, డయాబెటిక్ వ్యాధిగ్రస్తులలో పెరిపెరల్ స్టేజీని ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో రెండు మొబైల్ వ్యాన్‌ల ద్వారా వైద్య సేవలందిస్తున్నామన్నారు. జిల్లాలో టీబీ ఫ్రీ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందని, పోచారం, ఫీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నామన్నారు.

ధరణి సేవలకు అంతరాయం



తాండూరు రూరల్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే రైతులు, భూములు పట్టాచేసుకునే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులపాటు అన్నిరకాల సేవలు నిలిచిపోయాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ పోర్టల్‌ను గతేడాది వరకు టెరా ఐసీఎస్ అనే సంస్థ పర్యవేక్షిస్తూ వచ్చేది. ఈ సంస్థతో ప్రభుత్వం కుదుర్చుకున్న గడువు ముగియడంతో పోర్టల్ నిర్వహణను కేంద్ర సంస్థ ఎన్‌ఐసీకి అప్పగించింది. ఇందులో భాగంగా ధరణిలో ఉన్న డాటాను బదిలీ చేయాల్సి ఉన్నందున ధరణి సేవలను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అయితే ఈనెల 16వ తేదీన తిరిగి ఈ సేవలు ప్రారంభమవుతాయని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. దీంతో తాండూరు మండల పరిధిలో సుమారు ఆరు రిజిస్ట్రేషన్ల వరకు నిలిచిపోయినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.


రాచకొండ కోట

Sunday Special

అలనాటి రాచరిక పాలనకు సాక్షీభూతంగా రాచకొండ ఖిలా నిలుస్తోంది. రాచకొండను రాజధానిగా చేసుకుని గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు పద్మనాయక వంశీయులు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఇంకా కనుచూపు మేరలో కనిపించే కొండకోనలు, నీటి పరవళ్లు, నిండైన చెట్లు చేమలతో పరుచుకుని పచ్చటి హొయలతో నిండి సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని కట్టిపడేస్తోంది. పర్యాటకులు రాచకొండలో వీక్షించాల్సిన ప్రత్యేక ప్రదేశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.

రాచకొండ.. రాజదర్పం

సహజ సిద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు

- శత్రుదుర్భేద్యమైన రాతి కోటగోడ
- ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం
- అంతుచిక్కని సంకెళ్ల బావి రహస్యం
- నేటికీ భక్తులతో కళకళలాడుతున్న ఆలయాలు
- రాచకొండ పర్యాటకంపై ప్రత్యేక కథనం

మంచాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 14వ శతాబ్దంలో రాచకొండ ప్రాంతాన్ని పాలించిన పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల సింహభూపాలుడు రాచకొండ కోటను నిర్మించాడు. ఈ సామ్రాజ్యాన్ని మొదటగా కాకతీయులు, పద్మనాయక వంశీయులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు తదుపరి నిజాం నవాబులు పాలించారు. కాగా, పద్మనాయక వంశపాలకుల సమయమే రాచకొండకు స్వర్ణయుగమని పిలుస్తారు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం నిర్మించారు. వందల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ అంతఃపురం చుట్టూ రాతితో కట్టబడిన శత్రుదుర్భేద్యమైన కోటగోడ ఉంది. ఈ ప్రహరీ మొత్తం రాతితో నిర్మించబడి ఉండడం విశేషం. ఒక్కో ముఖఃద్వారం పరిధిలో ప్రత్యేక నిర్మాణాలు, కొలనులు ఉంటాయి. అంతఃపురం చుట్టూ వేలాది ఎకరాల్లో నిర్మాణాలు, గుళ్ల గోపురాలు దర్శనమిస్తాయి. సుమారు 900 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దేవాలయాలు

- మిగతా 7వ పేజీలో..

నరేందర్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు

వికారాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి త్వరలోనే నిర్దోషిగా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బీఆర్‌ఎస్‌కు చెందిన వికారాబాద్ జడ్పీ మాజీ వైస్‌చైర్మన్, మాజీ జడ్పీటీసీలు అన్నారు. నరేందర్‌రెడ్డి సతీమణి శృతిరెడ్డిని వారు శనివారం పరామర్శించారు. లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గత నెలరోజులుగా రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో పట్నం శృతిరెడ్డిని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయకుమార్, మాజీ జడ్పీటీసీలు ప్రమోదినీ, సుజాత, హరిప్రియ, అరుణ దేశునాయక్, నాగరాణి, కోట్ల మహిపాల్‌లతో పాటు నర్మద, శకుంతల, అనురాధ, శోభ, చందు పాషా పరామర్శించి ధైర్యం చెప్పారు.



శృతిరెడ్డిని పరామర్శిస్తున్న జడ్పీమాజీ వైస్‌చైర్మన్, మాజీ జడ్పీటీసీలు

ఇందిరమ్మ కమిటీలతో పారదర్శక పాలన

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు అందించేందుకు వారధులుగా ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని, ఈ కమిటీల ద్వారా గ్రామాల్లో పాలన పారదర్శకంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరంలో కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ నివాసంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ఇచ్చిన అర్జీల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రూ.5లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి విడతల వారిగా సాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు పనిచేస్తాయన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను పర్యవేక్షించేందుకు మండలాలు, డివిజన్ల వారిగా 5 నుంచి 8 మందిని స్పెషల్ అబ్జర్వర్లుగా పార్టీ నాయకులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఆర్థిక సాయం, స్థలం లేని పేదవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలను తయారు చేస్తుందన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని పైరవీల పేరుతో ప్రజలను ఎవరైనా మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ సహించదని అన్నారు. నాయకులు ఏనుగు జంగారెడ్డి, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, ఇజ్రాయేలు, వి.రఘుపతి, బాల్‌రాజ్, రాజునాయక్, లాజర్, జంగయ్య, పరమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కందులు



ధారూరు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం కొత్త కందులు(ఎర్రవి) అమ్మకానికి వచ్చాయి. సాయంత్రం మార్కెట్‌లో నిర్వహించిన బీట్లలో కందులు క్వింటాలుకు గరిష్ట ధర రూ.9,501, కనిష్ట ధర రూ.9,460లు పలికింది. 13 క్వింటాళ్ల కందులు క్రయవిక్రయాలు జరిగాయి. కాగా మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,450 నుంచి రూ.2,490లు, ధాన్యం 1010 రకం క్వింటాలుకు రూ.2,170 నుంచి రూ.2,260 వరకు, సోనా రకం క్వింటాలుకు రూ.2,450 నుంచి రూ.2,690 వరకు ధర పలికిందని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

నేడు పరిగిలో ముగ్గురు మంత్రుల పర్యటన

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజవర్గంలో ఆదివారం(నేడు) ముగ్గురు మంత్రులు పర్యటిస్తారని పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశరాంరెడ్డిలు తెలిపారు. పరిగి మార్కెట్ కమిటీల పాలవర్గాల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనుసూయ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా రూ.5 కోట్లతో నిర్మించనున్న మునిసిపల్ కార్యాలయం, రూ.6.4కోట్లతో చేపట్టనున్న లక్నాపూర్ రోడ్డు, గిరిజన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

కందుకూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాచులూరు మాజీ ఎంపీటీసీ వి.బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసచారిలు కోరారు. శనివారం అవేర్ సంస్థ ఆధ్వర్యంలో రాచులూరులో నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నప్పటికీ, ఉచిత వైద్య శిబిరాలు కూడా ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కామినేని ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు క్యాంపు నిర్వాహకుడు వెంకన్న తెలిపారు. వైద్యులు డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ దీక్షిత, సంస్థ అధికారి పి.వరుణ్ పాల్గొన్నారు.



రాచులూరులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే డబ్బుతో పాటు సమయం ఆదా అవుతాయని రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌ను ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించకోవడం ద్వారా సివిల్ కేసులలో చెల్లించిన ఫీజులను తిరిగి పొందవచ్చన్నారు. కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణాలలో 30 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాదబీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకున్నారని తెలిపారు. కాగా, క్రిమినల్, సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 1,48,015 కేసులు పరిష్కరించబడ్డాయి. అన్ని కేసులకు కలిపి రూ.18,72,49,348లు పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించారు. ట్రాఫిక్ కేసులలో రూ.6,34,67,535లు ప్రభుత్వానికి ఇప్పించారు. న్యాయవాదులు సోమయ్య, సుధలతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు, ఇన్సూరెన్స్ అధికారులు, ప్యానెల్ అడ్వొకేట్లు తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రాజీపడితే ఇద్దరూ నెగ్గినట్లే

- జిల్లాలో 2,009 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానంలో కేసు గెలిస్తే ఒక్కరే గెలుస్తారని, అదేలోక్ అదాలత్‌లో కేసు రాజీ కుదుర్చుకుంటే ఇద్దరూ నెగ్గినట్లేనని జిల్లా ప్రధాన న్యాయామూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎలాంటి పట్టింపులకు పోకుండా క్షమాగుణాన్ని అలవర్చుకొని కేసులను రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవడం కారణంగానే అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కోర్టులో కేసులేకుండా ఇరువురి మధ్య ఉన్న తగాదాను కూడా ఇరువురిలో ఒకరు అర్జీ పెట్టుకుంటే మరొకరిని కోర్టుకు పిలిపించి రాజీ కుదురుస్తామని తెలిపారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో కుటుంబకలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాలు, రహదారి ప్రమాదాలు, ఆస్తి, భూ, ఇతర తగాదాలకు సంబంధించిన 2009 కేసులను రాజీకుదిర్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయామూర్తి చంద్రకిషోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, డీబీ శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ద్వితీయశ్రేణి న్యాయమూర్తి నామాల అశోక్, జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీపీ సమీనాబేగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోలేదు

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోలేదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఐదవ మహాసభలు శనివారం పరిగిలో జరిగాయి. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యశాఖకు నిధులు పెంచామని తెలిపారు. యూపీఎస్‌ను త్వరలో రద్దు చేయిస్తామని తెలిపారు. గతంలో 15నాటికి కూడా జీతాలు వచ్చేవికాదని, ఇప్పుడు ఒకటో తారీఖుననే పడుతున్నాయని చెప్పారు. విద్యావ్యస్థను గాడిలోపడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కోరిన సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, విద్యాకమిషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరత్నం,రాములు, ఆహ్వానకమిటీ కన్వీనర్ వెంకటయ్య, సంఘం నాయకులు బిచ్చయ్య జమున, మోహిజ్, మెహ్యా, శంకర్‌రావు, జైపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొత్త పాలకవర్గంపై సరికొత్త ఆశలు!


అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు

- నేడు ప్రమాణస్వీకారోత్సవం
- ముగ్గురు మంత్రులు, స్పీకర్ రాక
- పరిగిలో రైతు బజారు ఏర్పాటు కలేనా?
- రోడ్డుపై సంతతో తప్పని తిప్పలు

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో జరిగే సంతకు ప్రత్యేకస్థలం లేక వ్యాపారులు, ప్రజలు అష్టకష్టాలు పడాల్సివస్తోంది. ప్రతీ శుక్ర, శనివారాల్లో జరిగే మార్కెట్‌ను పట్టణంలోని నడిబోడ్డున ఉన్న ప్రధాన రహదారులపై నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు తప్పడంలేదు. పరిగి మార్కెట్ కమిటీకి ఇటీవల కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఆదివారం(నేడు) పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధరసరి అనుసూయ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిలు హాజరవుతున్నారు. అయితే కొత్త పాలకవర్గంపై పరిగి ప్రాంత రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో రోడ్డుపైనే కొనసాగే ఈ సంతను ఏడాదిపాటు మార్కెట్ కమిటీ స్థలంలో కొనసాగించారు. అట్టి స్థలంలో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని పాలకవర్గం నిర్ణయించడంతో తిరిగి కూరగాయాల మార్కెట్ నడిపైనే నిర్వహిస్తున్నారు. శుక్ర, శని వారాల్లో నడవడానికి కూడా వీల్లేకుండా ఉంటుంది.


అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్


పరిగిలో రైతుబజారు ఏర్పాటుకు వేసిన శిలాఫలకం

నిలిచిన రైతుబజార్ నిర్మాణ పనులు

2002లో రైతుబజారు ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే కె.హరీశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి శిలాఫలకానికే పరిమితమైంది. గత మార్కెట్ కమిటీ రూ.75లక్షలతో రైతు బజారును, రూ.67లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నిధులు మంజూరు చేసింది. పనులను టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించించి పనులు ప్రారంభించింది. ఇట్టి స్థలం మాదని కొందరు వ్యక్తులను కోర్టును ఆశ్రయించారు. దీంతో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత సమస్య పరిష్కారం కాగా, ఇంటిగ్రేటెట్ మార్కెట్‌ను నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్ల దశకు చేరుకుంది. గత ఏడాదిగా అంతలోనే నిలిచిపోయింది.

రోడ్డుపై సంతతో ట్రాఫిక్ సమస్య

ఇదిలా ఉండగా, కూరగాయల సంతలు మాత్రం రోడ్డుపైనే కొనసాగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించే కూరగాయల సంత అయితే పూర్తి నడిరోడ్డుపైనే నిర్వహించడం వల్ల పాదచారులు సైతం నడువలేని విధంగా మారింది. పరిగి నియోజకవర్గంలోని కులకచర్ల, దోమ, పూడూర్ గ్రామాలకు చెందిన వేలాది మంది వస్తుంటారు. సీసీప్లాట్‌ఫామ్‌లు నిర్మించినప్పటికి వాటిపై షెడ్లు నిర్మించడం మరిచారు. దీంతో ముఖ్యంగా వర్షాకాలం అయితే నానా అవస్థలు పడాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు.

త్వరలోనే సమస్య పరిష్కారం



రైతుబజారు సమస్య త్వరలోనే పరిష్కారం కానుంది. పెండింగ్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెట్ త్వరలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు విశ్రాంతి భవనం, వేబ్రిడ్జిని ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా రైతు బజారు ఏర్పాటు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- బి.పరశురాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

రైతు బజారులోనే చేపల మార్కెట్ ఉండాలి



పరిగిలో ఏర్పాటు చేసే రైతు బజారులో చేపల మార్కెట్‌ను కూడా ఏర్పాటుచేయాలి. పరిగి ప్రాంతంలో మత్స్యకారులు చాలా ఎక్కువగా ఉంటారు. రైతుబజారును త్వరగా పూర్తి చేసే అందులో మత్స్యకారులకు ప్రత్యేకంగా షెడ్‌లను పూర్తిచేయాలి. రైతులకు విశ్రాంతి భవనం, ఇతర వసతులు కల్పించాలి.

- ఆనెం ఆంజనేయులు, మత్స్యవిభాగం జిల్లా అధ్యక్షుడు పరిగి

రైతు బజారు త్వరగా ఏర్పాటు చేయాలి



పరిగిలో రైతుబజారు త్వరగా ఏర్పాటు చేయాలి. రోడ్డుపై ఇరుకు స్థలంలో నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. మార్కెట్ శాఖ అధికారులు త్వరగా రైతుబజారు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రైతుబజారులో వ్యాపారులకు కాకుండా రైతులకు అవకాశం ఇవ్వాలి.

- నర్సింహులు, పరిగి

కొనసాగుతున్న రిలే దీక్షలు


దీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు

తలకొండపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 44వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు, యువకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్ చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలని అన్నారు. లేని యెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. జేఏసీ నాయకులు ఆంజనేయులుగౌడ్, అనిల్, యాదమ్మ, జంగమ్మ, అంజమ్మ, సుగుణమ్మ, కృష్ణయ్య, కుమార్, మాణిక్యం, మహేందర్, లింగయ్య, అల్లావుద్దీన్, గౌస్, అనిల్, జంగయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగమంటే తనకు ఎనలేని గౌరవం.. మర్యాద అని, అవినీతి లేని ఉద్యోగం అంటే చెప్పుకోదగ్గది ఉపాధ్యాయ వృత్తేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులతోనే సమాజం చక్కబడుతుందన్నారు. అయితే, దశాబ్ద కాలంలో పాలకులు విద్యావ్యవస్థను విధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, అధిక నిధులు సమకూరుస్తుందని చెప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలను తమ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. జీవో 317 వల్లనే ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, త్వరలోనే విద్యాశాఖను సమగ్రంగా ప్రక్షాళన చేసి అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై ఎర్ర జెండా నిరంతరం పని చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.శివయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు, కార్మికులపై దాడులు పెరిగాయని చెప్పారు. కార్మికులంతా ఐకమత్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రైతులు, కార్మికులు, కర్షకులు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

ఘట్‌కేసర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శనివారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెన నిర్మాణ పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులు వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. తమకు పరిహారం చేపట్టి, తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. గతంలో తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని కానీ ఇప్పటికీ స్థలం చూపించలేదని వాపోయారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. అందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలి


వాహనదారులకు హెల్మెట్ అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, పాఠశాల కరస్పాండెంట్ హనుమంతరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలోని మహానుభావులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో అత్యున్నత శిఖరాలకు ఎదగాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హితవు పలికారు. తూంకుంటలోని శ్రీవిజ్ఞానభారతి హైస్కూల్‌లో కరెస్పాండెంట్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇన్వెస్టిట్యూర్ సెరోమని, రైడ్ టు సేఫ్టీ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ వెంకట్‌రెడ్డి విచ్చేసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై పాటించావల్సిన జాగ్రతలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ట్రాక్స్ రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏసీపీ, శామీర్‌పేట పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌లు హెల్మెట్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ వంశీగౌడ్, హెచ్‌ఎం సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాచకొండ.. రాజదర్పం

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం గమనార్హం.

సంకెళ్లబావిలో నిధి నిక్షేపాలు

రాచకొండ కోట అంతఃపురం ఏడు ముఖఃద్వారాల్లో చివరి ముఖఃద్వారం దాటగానే సంకెళ్లబావి ఉంటుంది. ఈ సంకెళ్లబావికి ప్రత్యేకత ఉంది. అంత ఎత్తైన ప్రదేశంలోనూ ఈ బావిలో నీటి నిల్వలు ఉండడం విశేషం. పైగా ఈ బావి లోతు అంతుచిక్కనిదిగా ఉంటుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఆనాటి రాజులు తమ నిధి నిక్షేపాలను ఈ బావిలోనే దాచి ఉంచేవారని ప్రసిద్ధి. ఇంకా ఈ బావి నుంచి సొరంగమార్గం తంగెడిపల్లి చెరువుదాకా విస్తరించి ఉంటుందని ప్రచారంలో ఉంది. కొండ కింది భాగంలో స్వయంభు శంభు లింగేశ్వరాలయం ఉంటుంది. దేశంలో మరెక్కడా లేని పరిమాణంలో ఉన్న ఈ శివలింగానికి ప్రత్యేకత ఉంది. ఏటా శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.

రాచకొండకు ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్ నుంచి రాచకొండ కోటకు చేరుకోవాలంటే నాగార్జున సాగర్ హైవే దగ్గరి దారి. హైదరాబాద్ నుంచి సాగర్ హైవేలో 20 కిలోమీటర్ల వెళ్తే ఇబ్రహీంపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణించాక మంచాల మండల కేంద్రం వస్తుంది. ఇక్కడి కరెంటు జంక్షన్ మూలమలుపు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలోని తిప్పాయగూడ దాటాలి. అక్కడి నుంచి నేరుగా మరో 2 కిలోమీటర్ల తదుపరి సందర్శకులు రాచకొండ కోటకు చేరుకుంటారు.

సేదీ తీరే బోగని మంచం

రాచకొండ కోట కింది భాగంలో


గుర్రాల గుట్టపై గల నరసింహస్వామి దేవాలయం

అంతఃపురానికి విస్తరించి ప్రజలు నివసించేందుకు ఏర్పాటుచేయబడ్డ అనేక గ్రామాలు ఉంటాయి. అప్పట్లో ప్రజల నివాసం కోసం రాతితో నిర్మించబడిన ఇళ్లు, తాగు నీటి బావులు, వంటకోసం వినియోగించే రాతి రోళ్లు తదితరాలన్నీ ఈ ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తాయి. రాచకొండ కోట, ప్రజల నివాసం సముదాయాల మధ్య నుంచి వాగునీటి సెలయేరు ఎల్లప్పుడూ పారుతూనే ఉంటుంది. ఈ వాగుకు అనుసరించే వర్షాకాలంలో కొండల పైనుంచి జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. ప్రజావాసాల పక్కనే వీరభద్రేశ్వరస్వామి ఆలయంతో పాటు మరిన్ని దేవతామూర్తుల ఆలయాలు ఉంటాయి. ఇప్పటికీ కుటుంబాలతో సహా భక్తులు ఈ ఆలయానికి చేరుకుని వీరభద్రస్వామికి మొక్కులు తీర్చుకుంటారు. ఇదీగాక రాచకొండ కోటకు దక్షిణ ప్రాంతంలో ఉండే గుట్టపై బోగని మంచం అనే రాతి కట్టడం ఉంటుంది. రాజులు అప్పట్లో ఈ బోగని మంచానికి చేరుకుని సేదతీరి వెళ్లేవారని చరిత్రకారులు చెబుతారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయం.. ప్రత్యేకం

రాచకొండ అంతఃపురం కోటలో ఏడు ముఖఃద్వారాలతో ఒక భాగం కాగా లక్ష్మీనృసింహ స్వామి ఆలయం ఉండే ప్రదేశం మరో భాగం. దీనినే గుర్రాల గుట్టగా పిలుస్తారు. ఈ ప్రదేశం సుమారు వందకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. కొండపైనే ఐదు దశాబ్దాలు దాటినా చెక్కుచెదరని రీతిలో రాతితో నిర్మించబడిన నరసింహస్వామి ఆలయం ఉంటుంది. గుడి సమీపంలోనే గుర్రాలు సేదదీరేందుకు నిర్మించిన పెద్ద కొలను ఉంటుంది. అప్పట్లో ఈ గుర్రాల గుట్ట సైనికుల విడిదిగా కూడా ఉండేదని చెబుతారు.


సెలయేటివాగు


చుట్టూ విస్తరించి ఉన్న శత్రుదుర్భేధ్య కోటగోడ

ఏడాదిలోనే రూ.7,333 కోట్లతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో రూ.7333 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలోని తన నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.3100కోట్లతో దామగుండంలో నేవీరాడార్ స్టేషన్, రూ.3000 కోట్లతో రైల్వేలైను పనులు, వెయ్యికోట్ల మన్నెగూడ నాలుగు లైన్‌ల రోడ్డు, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పరిగి నియోజకవర్గంలో రూ.232 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రూ.20కోట్లతో పంచాయితీరాజ్‌రోడ్లు, రూ.23కోట్లు ఎస్‌ఆర్‌ఈజీఎస్ రోడ్లు, రూ.20 కోట్లతో తండాలకు తారు రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రూ.10 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు తీసుకోచ్చానని తెలిపారు. రూ.80కోట్లతో గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం జరుగుతుందనానరు. ఒక్క మునిసిపల్‌లోనే రూ.41 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఏడాదిలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 కోట్లు ఇచ్చామని తెలిపారు. రూ.8 కోట్లతో జాఫర్‌పల్లి, గోవిందాపూర్, అన్నారెడ్డిపల్లి, వెంకటరెడ్డిపల్లిలో సబ్‌స్టేషన్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్క పరిగిలోనే రైతులకు రూ.295కోట్ల రుణమాఫి చేశామని చెప్పారు. ఆరుగ్యారంటీల ద్వారా రూ.350కోట్లు, రూ.4,79కోట్లు గృహజ్యోతి కింద ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.

ఏడాదిలో మారనున్న కొడంగల్ ముఖచిత్రం

- సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక ప్రణాళిక
- మెస్‌చార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో వెనుకబడిన కొడంగల్ ప్రాంతం ఏడాది వ్యవధిలో ముఖచిత్రం మారి అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీల నూతన మెనూను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన భోజనం అందించే దిశగా 40శాతం మెస్‌చార్జీలు పెంచడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా ప్రతీరోజు మెనూ ప్రకారం నూతన విధానంతో చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. అదేవిధంగా కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాలు, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగుపడనుందన్నారు. 10 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడిలా పాలన కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న నల్లచెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మార్కెట్‌కమిటీ చైర్మన్లు అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, కౌన్సిలర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


కొడంగల్‌లో మెస్ చార్జ్ మెనూను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, నాయకులు

పాఠశాలలో ఘనంగా ఫుడ్‌ఫెస్టివల్

కొడంగల్‌లోని శ్రీ నేతాజీ విద్యాభవన్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మణిమాలరెడ్డి, ప్రిన్సిపాల్ వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామన్ డైట్‌తో విద్యార్థులకు పౌష్టికాహారం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి):అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్ ను ప్రారంభించిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచారన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న డైట్ మెనూను వికారాబాద్ జిల్లా ఎన్నపల్లి చౌరస్తాలోని మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికల)లో ఆయన విద్యార్థులకు నూతన డైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ రూంను సందర్శించి, సన్నబియ్యం, సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ. పెంచిన ధరలకు అనుగుణంగా కొత్త డైట్ మెనూను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. తద్వారా పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్థక ఆహారం అందుతుందని అన్నారు. విద్యార్థులు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తన అంతటి వారు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఆర్డీవో వాసుచంద్ర , కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా , మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిదులు , విద్యార్థులు, తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


మూడుచింతలపల్లి: దత్తాత్రే ఆలయానికి నిర్వహించిన హోమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

తాండూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పాత తాండూరులోని ప్రసిద్ధ వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి శ్రీ వేంకటేశ్వరస్వాముల ఉత్సమూర్తులకు ప్రత్యేకలంకరణ చేశారు. అంతకుముందు ధ్వజరా హోణం, గోపూజ, శ్రీ మహావిష్ణువు రుద్రయాగం, శ్రీవారి పల్లకీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

కొడంగల్ రూరల్: దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం గ్రామానికి చెందిన న్యాయాధికారి వినోద్‌కుమార్ (హైదారాబాద్‌లోని బంజారాహిల్స్ కోర్టు న్యాయాధికారి) ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

మూడుచింతలపల్లి: ఉద్దెమర్రి గ్రామ పరిధిలో ఉన్న సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ ఆలయానికి హోమపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, అనురాధ రవీందర్ రెడ్డి, జాము రవి పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని పెద్ద మాదారంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనలో నిర్మాణదాత బోయిని రాములు, అరవింద్‌రావు, అంజనేయులు, సురేందర్,ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాణిక్యం, రాములు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున వ్యవసాయం

- పొలాల్లో వేలాడుతున్న కరెంటు తీగలు
- సరిచేయాలని రైతుల వేడుకోలు


పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

పెద్దేముల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయపొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. చేయిపైకెత్తితే తగిలేంత ఎత్తులో తీగలు ఉండగా ప్రమాదం అంచునే రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. అయినా విద్యుత్ అధికారులు వాటిని సరిచేయడం లేదు. తీగలు సరిచేయాలని స్థానికంగా ఉండే సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని మంబాపూర్, ఖానాపూర్ గ్రామశివారు ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. కొన్నిచోట్ల చేయి ఎత్తకపోయినా మనిషి తలకు తగిలే విధంగా మారాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఏమరుపాటుగా ఎడ్లను అదిలించేందుకు చేయిపైకెత్తితే తీగలు తగిలి విద్యుత్‌షాక్ తగిలే అవకాశాలు ఉన్నాయి. ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించాలని పలువురు రైతులు కోరుతున్నారు. వేలాడుతున్న తీగలను సరిచేయాలని వేడుకుంటున్నారు.

కరెంటోళ్లకు చెప్పినా సరిచేయడం లేదు



ఖానాపూర్ శివాలో వ్యవసాయ పొలం ఉంది. అందులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. వాటి కిందనుంచి వెళితే తలకు తగిలేంత కిందకు ఉన్నాయి. పొలంలో పనిచేసే సమయంలో భయం వేస్తోంది. కరెంటు తీగలు సరిచేయాలని స్థానికంగా ఉండే సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా సరిచేయడం లేదు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే వెంటనే తీగలు సరిచేయాలి. - కందనెల్లి వెంకటేష్ (రైతు మంబాపూర్)

క్రైం కార్నర్

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

ధారూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిగుట్టలోని శ్రీ అనంత పద్మనాభ ఆలయ ప్రాంగణంలో కుక్కలగుంపు ఓబాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన శుక్రవారం జరగగా శనివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు, నాగారం గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోస్గి మండలం, మద్దూర్ గ్రామానికి చెందిన మౌనిక, మోనేష్ చారిల దంపతులు మండలంలోని నాగారం గ్రామంలోని బాలకృష్ణ చారి ఇంట్లో జరిగిన వివాహానికి వచ్చారు. వివాహ అనంతరం శుక్రవారం బాలకృష్ణ చారి బంధువులతో పాటు మౌనిక, మోనేష్ చారి వారి కుమారుడు మణికంఠచారి(3)లతో కలిసి దైవదర్శనం నిమిత్తం అనంతగిరి గుట్టకు వచ్చారు. అనంతపద్మనాభ దర్శనం కోసం హనుమంతుడి విగ్రహం వద్ద వాహనం నిలిపి వీరు కిందికి దిగారు. వీరితో పాటే కిందికి దిగిన బాలుడు మణికంఠచారిపై అక్కడే ఉన్న కుక్కలగుంపు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన స్థానికులు కుక్కలను చెదరగొట్టారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించినబాలుడి ప్రాణాలు కాపాడారు.

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు నేతల పరామర్శ


లీలావతిని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి

తాండూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాండూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థిని లీలావతిని మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలు, మాజీ స్పీకర్ మధుసూధన్‌చారి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌లు పరామర్శించారు. హైదరాబాద్ నగరం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లీలావతిని పరామర్శించి సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డితో కలిసి మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు గాజుల శాంత్‌కుమార్, బాలి శివకుమార్, విజయభాస్కర్, కృష్ణ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, సందీప్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చికిత్స పొందుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని చెప్పారు. ఆయన వెంట మార్కెట్‌కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ స్వప్న, వెంకన్న, ప్రవీణ్‌గౌడ్, మధులత శ్రీనివాస్‌చారి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఘట్‌కేసర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు శుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ గౌతమ్ పొట్రు తెలిపారు. పెంచిన డైట్ మెనూ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఫైన్‌ఆర్ట్స్ స్కూల్, అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, ప్రిన్సిపల్ రేణుక, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కీసర: కీసరగుట్టలోని బాలుర గురుకుల పాఠశాలను మల్కాజ్‌గిరి డీసీపీ రక్షిత కే మూర్తి జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకూమారితో కలిసి సందర్శించారు. సరుకులు నిల్వ చేసే గదిని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతారావు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని జగ్గంగూడ గ్రామ పరిధిలో ఉన్న టీఎమ్ఆర్ఈఎస్ బాలుర పాఠశాలలో డైట్ మెనూ ను మేడ్చల్ మల్కాజ్‌గిరి రాచకొండ డీసీపీ పద్మజ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: పట్టణంలోని కిష్టాపూర్ గురుకుల పాఠశాలను ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీధర్ గురువారం సందర్శించి కామన్ డైట్‌ను ప్రారంభించారు.

కీసర: కీసర పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఐఏఎస్ మకరంద్ సందర్శించారు. విద్యార్థులకు మెనూప్రకారం సమయానికి భోజనం అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికను, కూరగాయాలను, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నవాబుపేట: మండలంలోని హాస్టళ్లలో ప్రభుత్వ నూతన మెస్ చార్జీ మెనూ కార్యక్రమాన్ని తహసీల్దార్ జయరాం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్, వార్డెన్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలోని బీసీ హాస్టల్‌లో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, టీపీసీసీ మైనార్టీ నాయకులు రియాజ్, మహాత్మాజ్యోతిబా పూలే గురుకులంలో తహసీల్దారు వెంకటేష్‌ప్రసాద్, నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి, మధులత, శోభారాణి, మల్లేశం, నర్సింహులు, ప్రవీణ్‌కుమార్, నసీర్, మైపుస్, యాదయ్య, డీవై. నర్సింహులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులతో ముఖాముఖి, సహపంక్తి భోజనం, కామన్ డైట్ మెనూ కరపత్రాన్ని విడుదల చేసే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. తాండూరులో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, వెంకన్న, మమత నాగరాజ్, ప్రవీణ్‌కుమార్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, బంటు వేణుగోపాల్, మైనార్టీ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

పరిగి: జ్యోతిబాపూలే, మైనార్టీ, గిరిజన గురుకుల పాఠశాలల్లో నూతన మెనూ భోజనాన్ని ఆర్థికశాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారిణి హరితతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో ఎంఏ కరీం, ప్రిన్సిపాళ్లు మహబూబ్, హరిత, సుమతి, డిప్యూటీ వార్డెన్ జి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని బొట్లవనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ పద్మావతి సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. అదేవిధంగా దుద్యాల మండలంలోని చిలుముల్‌మైలారంలో గల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను అధికారి, తహసీల్దార్ కిషన్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో కొత్త మెనూ భోజన కార్యక్రమాన్ని ఎంపీవో జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్: డైట్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్ హాస్టళ్లకు చేరుకుని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కొత్త మెనూను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, కలాల్ నర్సింహులుగౌడ్, అనిల్‌కుమార్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.


కీసర: మహత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఐఏఎస్ మకరంద్

ధారూరు: ధారూరులోని బీసీ వసతిగృహాన్ని అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం సందర్శించారు. వసతి గృహ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లేశం, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రఘురాం, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, అశోక్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారంలో కొనసాగుతున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్, బహదూర్‌పుర జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను రీజినల్ ఫైర్ ఆఫీసర్ హరినాథ్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జయకృష్ణ, ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, ప్రిన్స్‌పాల్ శబీనా, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఐనెల్లి గ్రామ శివారులోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను డిప్యూటీ తహసీల్దార్ సందీప్ శనివారం ఆయన సందర్శించి నూతన మెనూను ప్రిన్సిపాల్ వినోద్ ఖన్నాతో కలిసి ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జినుగుర్తి గ్రామ వివారులో ఆదర్శ పాఠశాలతోపాటు కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తాండూరు మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెర్నె నాపగ్ప, యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ తదితరులు సందర్శించారు.కస్తూర్బా బాలికల విద్యాలయంలో నాసిరకం బియ్యం ఉన్నందున వెంటనే వాటిని మార్చేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగప్ప తెలిపారు.

పూడూరు: పూడూరులోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కామన్ డైట్ మెనూను అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ భరత్‌కుమార్, ఎంపీడీవో పాండు వార్దున్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.


తాండూరు: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్


పరిగి: గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత

యాలాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి అన్నారు. వసతి గృహాల్లో శనివారం ప్రభుత్వం కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల కేంద్రంలో గల ఎస్సీ బీసీ బాలుర వసతి గృహాలు, బీసీ బాలికల వసతి గృహాలను పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో తహసీల్దార్ అంజయ్య, బీసీ బాలుర వసతి గృహంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, బీసీ బాలికల వసతి గృహంలో స్పెషల్ ఆఫీసర్ పద్మారావులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, అక్బర్ బాబా, భీమయ్య, రాజు, వెంకటయ్య, వీరానందం, భాగ్యలక్ష్మి బాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహాన్ని తహసీల్దార్ మనోహరచక్రవర్తి శనివారం సందర్శించారు. పాఠశాలలో వంట గది, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ గోవర్ధన్, వార్డెన్ జైపాల్ రెడ్డి, సీఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో నూతన మెస్ చార్జీల చార్ట్‌ను ఎంపీడీవో మహేశ్ బాబు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, రజిత పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో శనివారం డైట్ కాస్మెటిక్స్ చార్జీలు 40శాతం పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో తహసీల్దార్ మురళీధర్ నూతన భోజన మెనూను ప్రారంభించారు. కులకచర్ల, అంతారం బీసీ బాలుర హస్టళ్లలో, కులకచర్ల బాలుర, రాంపూర్ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో నూతన భోజన మెనూను ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి


పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదిని ప్రారంభిస్తున్న దాత మల్లారెడ్డి

ఘట్‌కేసర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషిచేయాలని ఘట్‌కేసర్ సహకార సంఘం మాజీ వైస్‌చైర్మన్, దాత బోయపల్లి మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో శనివారం బోయపల్లి నర్సమ్మ సత్తిరెడ్డిల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రూ.8.50లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాలలో అదనపు గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత మల్లారెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, హెచ్‌ఎం డొండి బాయి, కౌన్సిలర్లు మహేష్, రవీందర్, నాయకులు బోయపల్లి సత్తిరెడ్డి, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, సామల బుచ్చిరెడ్డి, నర్సింహ, బాల్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం



పరిగి కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి శిల్ప

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇరుపక్షాలు రాజీపడితే సత్వరమే కేసులను పరిష్కరిస్తామని పరిగి మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప అన్నారు. పరిగి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించి కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. చిన్నచిన్న తగదాలతో కేసుల్లో ఇరుక్కుని సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో 210 కేసులు పరిష్కరించారు. ఎక్సైజ్ కేసులు 12, సీసీఎల్/ఏ కేసులు 42, సీసీ అడ్మిన్ 17, ఎస్టీసీ ఒకటి, సివిల్ ఒకటి, పీఎల్‌సీ 02, సైబర్ 49, డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులు 77 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్.శ్రీనివాస్, ఏపీపీవో యాదయ్య, ఏజీపీ సీహెచ్ బాలముకుందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, గౌస్‌పాష, కృష్ణారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

నవాబుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిలిపివేయాలని ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీసంపదను అమ్ముకుంటూ ఆదివాసీలకు అండగా ఉంటున్న మావోయిస్టులను హతమార్చడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే ప్రజాఫ్రంట్ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమాజ సేవలో ముందుండాలి



దయాదానం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజసేవలో ప్రతీఒక్కరు ముందుండాలని అనురాగ్ విశ్వవిద్యాలయ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ విష్ణువందన అన్నారు. అనురాగ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనిట్ 1 ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా దయాదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి దుస్తులు, స్టేషనరీ, స్వెటర్లు, కిరాణ సరుకులు, దుప్పట్లను వలంటీర్లు సేకరించి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు పంపిణీ చేశారు. సుమారు 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ వంతుగా విరాళాలు అందజేశారు.

30 కేంద్రాలు.. 10,196 మంది అభ్యర్థులు

(5వ పేజీ తరువాయి)

పీడబ్ల్యుడీ అభ్యర్థుల కోసం మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘా నీడలో పరీక్ష జరగనుంది. జిల్లాలో పరీక్ష నిర్వహించే 30 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచించారు. ఉదయం జరిగే పరీక్షకు 9.30 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 గంటలకు కేంద్రాల గేట్లు మూసి వేయనున్నారు. సూచించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరు. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను 6 రూట్లుగా విభజించారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు 30 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 టీజీపీఎస్సీ పరిశీలకులు, 10 మంది ఫ్లయింట్ స్క్వాడ్ అధికారులు, 12 జాయింట్ రూట్ అధికారులు, 108 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 460 మంది ఇన్విజిలేటర్ల సేవలను వినియోగించుకుంటున్నారు.
పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూ ధరించి పరీక్ష కేంద్రాలకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. సెల్‌ఫోన్లు, వాచ్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఇయర్ ప్యాడ్స్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తమ వెంట తీసుకు రావద్దని చెబుతున్నారు.

కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

గ్రూప్-2 పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ చట్టం అమలు చేయనున్నారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు 163 సెక్షన్ అమలు చేస్తారు. ఈనెల 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. పరీక్ష నిర్వహించే సమయంలో కేంద్రాల పరిసరాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఆన్‌లైన్, కంప్యూటర్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయనున్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

వికారాబాద్: గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం ఆయన సంబంధిత అధికారులతో జూం మీటింగ్ నిర్వహించారు. .జిల్లాలో మూడు 4401, 4402, 4404 (పీడబ్ల్యుడీ) సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్‌లు, శాఖపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ విధులు నిర్వహించాలని, పరీక్ష పత్రాలను తీసుకువెళ్లేందుకు బందోబస్తు, ఎస్కార్ట్‌తో వెళ్లాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, పబ్లిక్ సర్వీస్ రీజినల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో 116 పరీక్ష కేంద్రాలు

మేడ్చల్ ప్రతినిధి, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జిల్లాలో 116 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 72,999 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్ష మెటీరియల్స్ తరలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులందరికీ ప్రతి పరీక్షకు వేర్వేరుగా బయోమెట్రిక్ ఉంటుందని హాజరు తెలిపారు.

సంక్షిప్తంగా..

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

ధారూరు: మండలంలోని వీసీఎం తండా, గురుదోట్ల, అంపల్లి గ్రామాలలో శనివారం బీజేపీ బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులుగా పాండు నాయక్, శివకుమార్, అనంతయ్యలను ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పి.శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పాండుగౌడ్, ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాండూరు/బషీరాబాద్: రైల్వే ట్రాక్ మీదుగా వెళ్లే 33కేవీ పవర్ లైన్‌లో అండర్ గ్రౌండ్ కేబుల్ కనెక్షన్ పనులు జరుగుతున్నందున ఆదివారం(నేడు) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు గంటల పాటు తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని తాండూరు ఆపరేషన్ డీఈ భానుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దౌలాపూర్, లక్ష్మీనారాయణపూర్, నవల్గా, మైల్వార్, కాశింపూర్, దామర్‌చేడ్‌ల సమీపంలోనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని డీఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. బషీరాబాద్, యాలాల మండలాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

సీసీఐ విశ్రాంత కార్మికులకు గ్రాట్యుటీ

తాండూరు రూరల్: సీసీఐ కర్మాగారంలో గత కొన్నేళ్లపాటు కార్మికులుగా సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఎనిమిది మంది కార్మికులకు యాజమాన్యం త్వరలోనే గ్రాట్యుటీ డబ్బులు అందజేయనుంది. ఈసమస్య పరిష్కరించాలని అక్టోబరు 5వ తేదీన సీసీఐ యాజమాన్యాన్ని కోరినట్లు కరన్‌కోట్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ తెలిపారు. స్పందించిన యాజమాన్యం ఎనిమిది మంది కార్మికులకు సుమారు రూ.10లక్షల వరకు గ్రాట్యుటీ అందించే అవకాశం ఉందని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ తెలిపారు.

ఇంధన పొదుపుపై అవగాహన పెంచుకోవాలి

ఘట్‌కేసర్: ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని ఫోర్‌పీ ఎనర్జీస్ సీఈవో శివకుమార్ బోగా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఎనర్జీ మేనేజ్‌మెంట్ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈటీ వింగ్ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ప్రొఫెసర్ జీనకిరాములు, ప్రిన్స్‌పల్ కే శ్రీధర్, ప్రొఫెసర్ శివకేశవరెడ్డి, అరుణ్‌రెడ్డి, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్: ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం యశోద ఆస్పత్రి బృందం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా 268మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. గుండె, ముత్రపిండాలు, రక్తపోటు వంటి వ్యాధులను ముందుగా గుర్తించి చికిత్స చేయించుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మచ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుశీల పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

యాలాల: యాలలాల మండల కేంద్రంలో శనివారం జిల్లా కో-ఆప్టన్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనేరి శ్రీనివాస్ తదితరులు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, మైను, గడ్డం రాములుగౌడ్, లాలు, దూస చంద్రశేఖర్, బూర్గుపురి నర్సింహులు, యు.నర్సింహులు, మారేపల్లి అశోక్, యు.నర్సింహులు, కిష్టప్పగౌడ్, అమీర్, జబ్బర్ పాల్గొన్నారు.

నాగారం నర్సింహులుకు మాజీ ఎమ్మెల్సీ నివాళి

తాండూరు: ఇటీవల మృతిచెందిన తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులు చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీఎమ్మెల్సీ రాంచందర్‌రావు నివాళులర్పించారు. తాండూరులో శనివారం నాగారం కంపౌండ్‌లో నర్సింహులు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఆయనవెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్, కృష్ణ ముదిరాజ్, శాంత్‌కుమార్, బాలిశివకుమార్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్‌లు తదితరులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్సవానికి తాండూరు నుంచి తరలిన కురువ సంఘం ప్రతినిధులు

తాండూరు: హైదరాబాద్ నగరంలోని కోకాపేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్సవానికి తాండూరు నియోజకవర్గ కురువ సంఘం ప్రతినిధులు తరలివెళ్లారు. తాండూరు పట్టణం బీరప్ప స్వామి ఆలయం వద్ద శనివారం కురువ సంఘం పెద్దలు ఎస్.హనుమయ్య జెండా ఊపి ప్రారంభించారు. చలో కోకాపేట్ కార్యక్రమానికి తాండూరు డివిజన్ కురువసంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో బయల్దేరుతూ కురుమల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.